# సన్మానం!

-దాసరి శారద

**ఉదయం** ఎనిమిది గంటలవుతుంది. కాఫీ సేవించడానికి హోటలుకు బయలు దేరాను. ఇంతలో ద్వారక తారాజువ్వలా దూసుకు వచ్చాడు. వస్తూనే—''నిజంగా చాలా అవమానంగా ఉందోయ్'' అన్నాడు.

నేను ఆశ్చర్యపోయాను, రావడమే 'అవమానం' అంటున్నాడేమిటా అని. ''అసలు జరిగిన సంగతేమిటో చెప్పకుండానే అవమానమంటావేమిటోయ్!'' అన్నాను ద్వారకతో.

''ఇంకా ఏం చెప్పేది? నా కంటే వెనక రచనలు చేయటం మొదలుపెట్టిన వారంతా సత్కారాలు చేయించుకుంటూ, సన్మానాలు అందుకుంటూ ఉంటే—నా పేరు తలచిన వారే లేకపోయె. వాళ్ళంతా తమ పేర్లను పేపర్లో చూచుకొని మురిసిపోతూ ఉంటే, అనామకుని వలె నేను ఎవరి దృష్టిలోనూ పడకుండా ఉండటమాయె. ఇంతకంటే ఇంకా అవమానమేమి కావాలి?'' అన్నాడు ద్వారక రొప్పుతూ.

''ఓస్! ఇంతే కదా! నేను ఇంకా ఏమి కొంప లంటుకున్నాయోనని భయపడ్డాను. ఇంత మాత్రానికి నీవు అంత బాధ పడవలసిన అవసరం ఏమీ లేదులే'' అన్నాను.

''నీ కట్లాగే ఉంటుందిలే. నిన్న గాక మొన్న గీకటం మొదలుపెట్టిన వెంకటేశం కూడా సన్మానం చేయించుకున్నాడు. ఐదు సంవత్సరాల నుండి అమోఘంగా సారస్వత సేవ చేస్తున్న నన్ను తలచే నాథుడే లేకపోయె. మరిక నేను పైకి రావాలంటే ఎలా వస్తాను?'' అన్నాడు ద్వారక, తన మనస్సులోని అక్కసునంతా వెళ్ళగక్కుతూ.

''అయితే ఇంతకీ నీకూ సన్మానం కావాలంటావు. అంతేనా?'' అన్నాను ద్వారకను పరిశీలనగా చూస్తూ.

''సన్మానమంటే నా సంతోషానికే కాదోయ్. నా పేరు నలుగురికీ తెలియాలంటే ఏదో ఒక సభలోనైనా సన్మానం జరగాలా! పదిమందీ చెప్పుకోవాలంటే నా పేరు పేపర్లోనయినా పడాలా? ఇదంతా జరగాలంటే నీలాంటి వాళ్ళు నలుగురు పూనుకోకపోతే ఎలాసాధ్యమవుతుంది చెప్పు?''అన్నాడు ద్వారక, తన కోరికను తెలియజేస్తూ.

''అదెంత భాగ్యమోయ్! రేపే పాటికి నీకూ సన్మానం చేయిస్తాను సరేనా? దీనికింత హైరానా పడవలసిన పని లేదు. నీవు నిశ్చింతగా ఉండు అన్నాను నేను, ద్వారకను తృప్తిపరచాలనే ఉద్దేశ్యంతో.

ఊఁ! అది అంత తేలికగా అయ్యే పనా?'' అన్నాడు ద్వారక కొంచెం ఆశతోనే.

''కొంచెం కష్టమే అనుకో. అయినా, మనం తలుచుకుంటే సాధ్యం కాని దేమిటి చెప్పు?'' అన్నాను అదేదో తేలిక అన్నట్లు.

''చూడు, రామం! నీవు గనక ఈ పనికి నడుము కట్టుకున్నావా—నీవు చేసిన మేలు ఈ జన్మలో మరిచిపోను'' అన్నాడు ద్వారక, నా రెండు చేతులూ పట్టుకొని.

''నీ పేరు అందరికీ తెలిసేటట్లు చేసే భారం



నాకు వదిలేయ్. ఆ చింత నీకేమీ వద్దు. వచ్చే ఆదివారంనాడు నీకు ఘన సన్మానం జరుగుతుంది. సరేనా?'' అన్నాను ద్వారకతో.

''అంత తొందరలో జరగటం సాధ్యమంటావా? మరి సభ జరగాలంటే డబ్బు అదీ కావాలాయె'' అన్నాడు ద్వారక సందేహంతో.

''డబ్బు సంగతి ఆలోచించాల్సిందేననుకో. అయినా, మా నాన్న గార్ని అడిగి రెండు మూడు వందలు పట్టుకొస్తే, మిగతా డబ్బు మనం ఎలాగో సర్దుకోవచ్చు'' అన్నాను నేను.

''మా నాన్న గారికి ఈ విషయం తెలిస్తే అసలు సభ జరగటమే కష్టమవుతుంది. అలాంటప్పుడు ఆయన డబ్బిస్తాడనేది కలలో మాట'' అన్నాడు ద్వారక కొంచెం బాధపడుతూ.

అదీ నిజమే. ద్వారక తండ్రి చండ శాసనుడు. ద్వారకకి పాతికేళ్ళు వచ్చినా తండ్రి అంటే తగని భయం.

''మరేం చేద్దాం? సరే నేను ఆలోచిస్తాను. నీవు ఆ నాటి సభలో చదివే గేయాల్ని, ఉపన్యాసాన్ని గూర్చి ఆలోచించుకో. మిగతా బరువు బాధ్యతలు నేను చూచుకుంటాను'' అన్నాను.

''ఈ దెబ్బతో వెంకటేశంగాడి గర్వ మణగాలి. తానే ఏదో గొప్ప రచయితనని, తనకే ఘన సన్మానం జరిగిందని గర్విస్తున్నాడు. హు! ద్వారకానాథుడంటే ఏమనుకున్నాడో!'' అని భుజాలెగుర వేశాడు ద్వారక.

''వెంకటేశానికి జరిగిన సన్మానం ఒక ఎత్తు. రేపు నీకు జరుగబోయే సన్మానం ఒక ఎత్తు. ద్వారకా నాథుని పేరు ఆంధ్ర దేశమంతా మారు మోగిపోతుంది రేపటి సన్మానంతో'' అన్నాను నేను.

''అయితే, నేను వెళ్ళివస్తానోయ్. రేపు కలుసుకుందాం'' అని చెప్పి వెళ్ళిపోయాడు ద్వారక.

''అమ్మయ్య'' అని నేను విశ్రాంతిగా గాలి పీల్చుకొని కాఫీ హోటలువైపు నడక సాగించాను.

ద్వారకానాథుడూ, నేనూ చిన్నతనంనుంచీ మంచి స్నేహితులం. ద్వారకకి ఇప్పుడు ఇరవై అయిదేళ్ళు ఉంటాయి. ద్వారక తండ్రి వెంకటకృష్ణయ్యగారు డిప్యూటీ కలెక్టరుగా చేసి ఇటీవలనే రిటైరయినాడు. ద్వారకకి తండ్రంటే తగని భయం. ద్వారక బి. ఎ. ఫెయిలయి చదువు మానివేశాడు. మళ్ళీ పూర్తి చేయాలనే ఆసక్తి కూడా లేదు. అతని దృష్టి ఎంతసేపూ కవిత్వంమీద, గేయ రచనమీద ఉంటుందే గాని, పాఠ్య గ్రంథాలమీద ఉండదు. తండ్రి నయానా, భయానా చెప్పి చూచి, ఇక లాభంలేదని ఊరుకున్నాడు. ద్వారక తాను రచించిన గేయాల్ని పత్రికలకు పంపటం మొదలుపెట్టాడు. అప్పుడప్పుడు సాహిత్య విమర్శలు, సారస్వత వ్యాసాలు వ్రాసి పంపేవాడు. పత్రికలో తన పేరు చూచుకొని మురిసిపోయేవాడు. మొత్తంమీద ద్వారకానాథుడు రచయితగా నలుగురి దృష్టిలోనూ పడ్డాడు. అడప దడప తన రచనలను మా ఇంటికి తీసుకొని వచ్చి నాకు చదివి వినిపిస్తూ ఉండేవాడు.

ద్వారకంటే నాకు చాల అభిమానం. మా చిన్ననాటి స్నేహమే అందుకు కారణం. ఈరోజు వాడు నా దగ్గరకు వచ్చి చెప్పిన సంగతులన్నీ విన్నమీదట ద్వారకానాథుడికి కూడా ఒక సన్మాన సభ ఏర్పాటు చేయాలనిపించింది నాకు. పాపం వాడి ముచ్చట కూడా తీర్చాలిగా. తరువాత నాకు పెద్ద ఆలోచన పట్టుకున్నది. సన్మానం చేయాలంటే ఎంతలేదన్నా ఏడెనిమిదివందల రూపాయలన్నా కావాలి. ఏం చేయాలి? ఆలోచించాను. ఆలోచనలతో రాత్రంతా నిద్రపట్టలేదు. ఉదయమే ఒక నిర్ణయానికి వచ్చాను. ద్వారకకీ, నాకూ ఆప్తమిత్రులు అయిదారుగురు ఉన్నారు. అందరినీ ఒకచోట సమావేశపరచి ద్వారక సన్మానం సంగతి చెప్పాను. వాళ్ళు కూడా మాలాగే నిరుద్యోగులే. ఒక్కడూ సంపాదించుకుంటున్నవాడు లేడు—ఆర్థికంగా తోడ్పడడానికయినా.

మేమంతా ఆలోచించి ఎలాగయినా ద్వారకకి సన్మానం చేసే తీరాలనే నిర్ణయానికి వచ్చాము.

ఆరోజు ద్వారకకి ఏదయినా బహుమానం ఇవ్వాలిగా. ఏమి ఇస్తే బాగుంటుంది? డబ్బు లేదు ఎలాగ?

ఈ విషయం ఆలోచిస్తూ ఉంటే ధర్మారావు ఒక సలహా ఇచ్చాడు.

''చూడు, రామం! మా నాన్నగారికి మొన్నీమధ్య సుయోధన పాత్ర ధరించినందుకు ఉత్తమ నటుడిగా ఒక వెండి దీపం కుందె బహుమతిగా లభించింది. దానిని నేను తీసుకువస్తాను. ఆ రోజు సభలో మన ద్వారకకి బహూకరిస్తే నలుగురిలో ఎంతో ఘనంగా ఉంటుంది-ఏమంటావ్?'' అన్నాడు.

'ఓహ్! నీ సలహా బాగుంది'' అని నేను ధర్మారావుని ప్రశంసించేలోగా—మరొక మిత్రుడు సుబ్రహ్మణ్యం అందుకుని—''దీపం కుంది ఇచ్చి ఊరుకుంటే ఎలా? మా ఇంట్లో పండిత శాలువలున్నాయి. వాటిలో మంచి కాశ్మీరు శాలువని చూచి పట్టుకొస్తాను. ద్వారకకి శాలువ కప్పితే సమయోచితంగాను, సముచితంగాను ఉంటుంది'' అన్నాడు. సుబ్రహ్మణ్యం తండ్రి పండితుడు లెండి. అందుచేత శాలువలకి కొరత లేదు.

ఇంతలో కేశవమూర్తి అందుకున్నాడు. ''ఆరోజు లైట్లు, మైక్ ఏర్పాటు చేయించే బాధ్యత నాది. నా మిత్రుడు లక్ష్మణరావు వాళ్ళకి లౌడ్‌స్పీకర్లు, లైట్లు వగైరా అద్దెకిచ్చే కొట్టు ఉన్నది. అడిగితే నా మాట కాదనడు'' అని భరోసా ఇచ్చాడు.

''సరే అంతా బాగుంది. ఇక టీపార్టీ సంగతి ఆలోచించాలి'' అని నేను అంటూ ఉండగానే ద్వారక వచ్చాడు.

''టీపార్టీ దేముందోయ్. 'ఆనందా విలాస్'లో ఆర్డరిద్దాం'' అన్నాడు.

''మరి డబ్బు మాటో?'' అన్నాడు ధర్మారావు.

''డబ్బు సంగతి దేవుడెరుగు. ప్రస్తుతానికి పని జరగాలిగా. ముందు ఆర్డరిచ్చి, డబ్బు తర్వాత ఇస్తామని చెబుదాం. ఆ హోటలు మేనేజరు నాకు బాగా తెలుసు'' అన్నాడు ద్వారక.

మేం చదువుకున్న కాలేజి ప్రిన్సిపాల్‌గార్ని అధ్యక్షులుగా, హైస్కూల్లో సీనియర్ తెలుగు పండితులు కృష్ణశర్మగారిని ఉపన్యాసకులుగా ఆహ్వానించాలని నిశ్చయించుకున్నాం. అందరం చాలా హుషారుగా ఉన్నాం. ద్వారక ఆనందానికి మేరలేదు.

''అయితే నేను ముకుందా ప్రెస్‌కి వెళ్ళి కరపత్రాలు వేయిస్తాను'' అన్నాను నేను.

ఆ నాలుగు రోజులూ మా మిత్ర బృందానికి నిద్రలేదు. ఆదివారం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నాం.

కరపత్రాలు అచ్చయి వచ్చాయి. మిత్రులంతా అందరికీ కరపత్రాలు పంచిపెట్టి బాగా ప్రచారం చేశారు. ఇంతలో ఆదివారం రానేవచ్చింది.

సాయంత్రం అయిదింటికి ప్రిన్సిపాల్‌గారు, ఇంకా కొందరు ఆహ్వానితులకు 'టీపార్టీ' జరిగింది. ఆరు గంటలకు వేదిక దగ్గిర మైకు, లైట్లు ఏర్పాటు బ్రహ్మాండంగా చేశారు. ఆరున్నర గంటలకు సభ బాగా జనంతో నిండిపోయింది. అధ్యక్షుల వారు తమ ఉపన్యాసం ప్రారంభిస్తూ—''ద్వారకానాథుడు ఇంత చిన్న వయస్సులోనే ఇంత ఘన సన్మానం అందుకుంటున్నాడంటే, ఆయన ఎంత గొప్ప రచయితో మనకు స్పష్టమవుతున్నది. నేను ద్వారకగారి రచనలను చదివాను. వారి రచనలో వైవిధ్యం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. ఈ సభకు అధ్యక్షత వహించటం నాకు గర్వ కారణం....'' అని చెప్పారు.

కృష్ణశర్మగారు తమ ఉపన్యాసం కొనసాగిస్తూ—''ద్వారక బహుముఖ ప్రజ్ఞాశాలి అనీ, మంచి భవిష్యత్తు ఉన్న రచయిత'' అనీ కొనియాడారు.

తరవాత ద్వారక తనకు జరిగిన సన్మానానికి సమాధానమిస్తూ—''నాకు చేసిన ఈ సన్మానానికి నేను తగుదునా? అని సందేహం కలుగుతున్నది. నేను ఇంత పైకి రాగలిగానంటే అందుకు మీ ఆదరాభిమానాలే కారణం. ఇక ముందు కూడా నా శక్తి వంచన లేకుండా రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తానని మనవి చేస్తూ సన్మాన సంఘం వారికి నా కృతజ్ఞతలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను'' అని ముగించాడు.

అధ్యక్షుల వారి చేత ద్వారకకు బహుమతిని అందింప చేశాం. కాశ్మీరు శాలువను కృష్ణశర్మ గారు ద్వారకకి కప్పి అభినందించారు. సభ జయప్రదంగా ముగిసింది.

పత్రికా విలేఖరులను కూడా ఆహ్వానించటం చేత వారు ఆనాటి కార్యక్రమాన్ని వ్రాసుకొన్నారు. మొత్తం మీద ద్వారక సన్మానం మేము ఊహించిన దానికంటే బ్రహ్మాండంగా జరిగింది.

నేను బాగా అలిసి పోవటం చేత తరవాత రెండు రోజులూ ఎక్కడికీ వెళ్ళలేదు. మూడవ రోజు ఉదయమే కాఫీ త్రాగి తీరిగ్గా ద్వారకను చూచి వద్దామని వాళ్ళ ఇంటికి వెళ్ళాను. తలుపు దగ్గరికి వెళ్ళేటప్పటికి ద్వారక ఇంట్లో ఏదో గొడవ జరుగుతున్నట్లు అనిపించింది. నేను వాకిట్లోనే నిలబడి ఆలకించసాగాను.

ఒకాయన అంటున్నాడు: ''ఏదో మీ ముఖం చూచి అప్పిచ్చాను గాని, మీ పుత్రరత్నాన్ని చూచి

గాదు. మొన్న హోటలుకి వచ్చి ఎంతో తియ్యగా కబుర్లు చెప్పి వంద రూపాయలకు ఆర్డరు ఇచ్చాడు. డబ్బు మరునాడు ఇస్తానని చెప్పాడు. ఇప్పు డడిగితే ఏమీ మాట్లాడటం లేదు'' అంటున్నాడు.

నా కర్థమయింది. ఆయన కాఫీ హోటలు మేనేజరు. నాకు గుండెలో రాయి పడింది. కొంచెం వంగి లోపలికి చూచాను. పాపం ద్వారక బిక్క ముఖంతో దిక్కులు చూస్తున్నాడు. వాళ్ళ నాన్న అంటున్నాడు. ''ఏరా! మాట్లాడవేం? ఇంత అప్పు ఎందుకు చేశావు? నీ తాత ఎవరు తీరుస్తా రనుకున్నావు? విందులు చేసేటంతటి వాడి వయ్యావన్నమాట! మర్యాదగా తీర్చావా సరి— లేక పోతే ఈ ఇంట్లో ఉండటానికి వీలులేదు. జాగ్రత్త ఎలా తీరుస్తావో తీర్చుకో'' అని గర్జిస్తున్నాడు.

ఇంతలో ధర్మారావు పరుగెత్తుకుంటూ వచ్చాడు.

వాకిట్లో నన్ను చూచి, ''ద్వారక లోప ఉన్నాడా?'' అని అడిగాడు.

''ఏం? ఏమిటి సంగతి?'' అన్నాను.

''ఇంకా సంగతేమిటి? నా పళ్ళు పెట్లే పోతేను. మా నాన్న దీపం కుంది కోసం చూచు కొని కనపడక పోయే టప్పటికి నన్ను గట్టిగా ప్రశ్నించాడు. నేను నిజం చెప్పాను. అప్పుడు నా వీపు మీద వడ్డించి మర్యాదగా ఆ కుందిని తీసుకు రమ్మన్నాడు'' అన్నాడు ఏడుస్తూ.

''సరేలే. గొడవ చేయక.. నేను మెల్లగా తెప్పించి ఇస్తాను. అసలే వాళ్ళ నాన్న అరుస్తున్నాడు. నీవు కూడా ఇప్పుడే వెళ్తే ఇంక ద్వారకని చావగొడ్తాడు'' అన్నాను.

''సాయంత్రానికి తప్పకుండా ఇవ్వాలి. లేక పోతే మా నాన్న బ్రతకనియ్యడు'' అన్నాడు ధర్మా రావు.

''అలాగేలే'' అని సర్ది చెప్పి సాగనంపాను. ఇంతలో హోటలు మేనేజరు బయటకు వచ్చేశాడు.

నేను మెల్లగా లోపలికి వెళ్ళాను. ద్వారక తండ్రి నన్ను చూచి—''ఏమోయ్ రామం! ఏమిటి సంగతి? మా ద్వారకకి సన్మానం చేయించావటగా! భలే వాడివయ్యా! ఇలాంటి సన్మానం ఇంతవరకు ఎక్కడా జరగలేదు. అప్పులవాళ్ళు వెంట పడు తున్నారు. వాడొక పాత్రగాడనుకో, మీరు సన్మాన సంఘ సభ్యులానా? ఇదేమి సన్మానమయ్యా! వాడికి తెలియకపోతే పోనీ నీవైనా చెప్పగూడదా? ఇదేనా మీరు చేయవలసిన పని'' అని నన్ను గూడా చీవాట్లు పెట్టాడు. నేను ఏమీ మాట్లాడ లేదు. ఇంతలో మా ఇంటి దగ్గర నుండి కబురు వచ్చింది — 'ముకుందా ప్రెస్' యజమాని వచ్చాడనీ — కరపత్రాలు అచ్చు వేసినందుకు డబ్బు అడుగుతున్నాడనీ. నేను ఇంటికి వెళ్ళాను. అందరికీ సర్ది చెప్పేటప్పటికి నా తల ప్రాణం తోకకి వచ్చింది. ఏమయితేనేం? మా ద్వారక సన్మానం


# యద్దనపూడి సులోచనారాణి

సైకో రొమాంటిక్ సస్పెన్స్ థ్రిల్లర్

## జాహ్నవి

వెల 12రూ.

MSC

క్రౌన్ సీరీస్

6-4-'81 విడుదల!

విడుదలకు ముందే ఆర్డరిస్తే 11 రూ.లకే!

అతను ఒక అడుగు సోఫా దగ్గరగా వేసాడు. మరు క్షణంలో మోకాళ్ళమీద కూలబడి ఆమె ఒడిలో తల దాచు కున్నాడు. "నేను నిజంగా పిచ్చివాడినేమో నాకు తెలియటం లేదు। నేను రాజానా? రవినా? నేను రవినే। నువ్వు కాదని అంటే నేను నిజంగా పిచ్చివాడినే అనుకుంటాను। నేను పిచ్చి వాడినే అయితే నేను వైద్యం చేయించుకుంటాను. జాహ్నవీ! నేనెవరిని? రవినా? రాజానా? చెప్పు. ప్లీజ్ చెప్పు. నువ్వు చెబితే నేను నమ్ముతాను. నామీద నాకు నమ్మకం పోతోంది" అతని కంఠం భావోద్వేగంతో కంపించింది.

జాహ్నవి అతని తలమీద చెయి వేసింది. అప్ర యత్నంగా నిట్టూర్చింది. "నాకు కొద్దిరోజులు టైమ్ యివ్వు. నువ్వు రాజావో రవివో చెబుతాను. అంత వరకూ నువ్వు తొందర పడకు" అంది.

ఆద్యంతం ఉత్కంఠతతో చదివించి, మీరు వూహించని ఎన్నెన్నో మలుపులతో గంగాప్రవాహంలా సాగిపోయే నవలారాజం! శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి సైకో రొమాంటిక్ సస్పెన్స్ థ్రిల్లర్ "జాహ్నవి" కోసం మీ ఆర్డర్ నేడే మీ దగ్గర్లో వున్న బుక్‌సెల్లర్ వద్దగాని, న్యూస్ ఏజంట్ వద్దగాని బుక్ చేసుకోండి। 6-4-'81 లోపు బుక్ చేసుకుంటే రూ. 11 లకే! పోస్టులో తెప్పించు కోవాలంటే క్రింది చిరునామాకి రూ. 10 లు ఎమ్.ఓ. చేయండి. ఒక రూపాయికి వి.పి. పెట్టి, 6-4-'81 అందేలాగా పంపుతాము.

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్
రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3